అన్ని జిల్లాలకు బ్యూరో చీఫ్స్ కావలెను..
సంప్రదించాల్సిన నంబరు
93916 66193

www. vishwamnews.com


విశ్వం న్యూస్

The Digital Daily

Contact WhatsApp:90525 66193

హైదరాబాద్, ॥ సంపుటి:1 ॥ సంచిక: 1 ॥ మంగళవారం ॥ 27-10-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

భూ కబ్జా భాగోతం!



నర్సాపూర్‌లో కలకలం

- పట్టా భూమి పేరుతో ప్రభుత్వ స్థలం విక్రయం
- గ్రామస్థుల ఆందోళన, తక్షణ చర్యలకు డిమాండ్

మెదక్ జిల్లా, నర్సాపూర్ మండలం, నాత్నాయిపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జా భాగోతం వెలుగులోకి వచ్చి తీవ్ర కలకలం రేపుతోంది. నాత్నాయిపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 119/1లో సుమారు మూడు నుండి నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా కబ్జా చేసి, చుట్టూ పలకలు వేసి ఆక్రమించుకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. 2

- మెదక్ ప్రతినిధి , 26 అక్టోబర్ (విశ్వం న్యూస్) :



సింగరేణిని మరింత బలోపేతం చేస్తాం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



రాహుల్ గాంధీకి తెలంగాణ ఏటీఎం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 26 (విశ్వం న్యూస్) :

సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ రాహుల్ గాంధీకి ఏటీఎంగా మారిందని.. రేవంత్‌రెడ్డి ఆయనకు ఏటీఎం కార్డులా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆదివారం పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదిలాబాద్‌కు చెందిన ఎన్ఎస్‌యూఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండే, ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ సీనియర్ నాయకుడు జిబ్రాన్ షరీఫ్‌తోపాటు తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కేటీఆర్ (మిగతా 2వ పేజీలో)



కొరియాతో బంధానికి సర్కారు ప్రాధాన్యం

కొరియా సంస్థల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, యువత నైపుణ్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆధునిక తయారీ, లైఫ్ సైన్సెస్, పునరుత్పాదక ఇంధనం, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో కొరియా సంస్థలతో కలిసి పనిచేసేందుకు తెలంగాణలో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబర్ 26 (విశ్వం న్యూస్) :

మాదాపూర్ శిల్పకళా వేదికలో ఆదివారం నిర్వహించిన కె హార్మనీ ఫెస్టా-కొరియా కల్చర్ డే 2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. 2024 ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణ కొరియాలో చేపట్టిన పర్యటన సందర్భంగా జరిగిన పెట్టుబడుల చర్చలు రెండు ప్రాంతాల మధ్య (మిగతా 2వ పేజీలో)



ఉగ్రవాదంపై ఉమ్మడి పోరుకు ఇరు దేశాల చర్చలు

పార్లమెంటు ప్రాంగణంలో 12వ సమావేశం

రష్యా ప్రతినిధి బృందంతో లోక్‌సభ స్పీకర్ భేటీ

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వంపై రష్యా మద్దతుకు ప్రశంస

న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (విశ్వం న్యూస్) :

పన్నెండవ బ్రిక్స్ పార్లమెంటరీ వేదిక సమావేశాలు సోమవారం పార్లమెంటు ప్రాంగణంలో ప్రారంభం కానున్నాయి. ఈ అంతర్జాతీయ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్ల (మిగతా 2వ పేజీలో)



ఢిల్లీ విమానాశ్రయంలో ఉగ్రవాద నిరోధక కసరత్తు

ఉగ్రదాడి, బందీల విముక్తిపై ప్రత్యేక సాధన

సమన్వయంతో పాల్గొన్న భద్రతా బలగాలు

సీఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌జీ, ఢిల్లీ పోలీసుల భాగస్వామ్యం

విమాన ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ముందస్తు సన్నద్ధత

న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (విశ్వం న్యూస్) :

దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉగ్రవాద నిరోధక సంయుక్త విన్యాసాన్ని నిర్వహించారు. ఉగ్రవాదులు విమానాశ్రయంలోకి చొరబడి దాడికి పాల్పడినట్లు, కొందరిని బందీలుగా పట్టుకున్నట్లు ఊహాత్మక పరిస్థితిని సృష్టించి ఈ సాధన చేపట్టారు. ఇలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు భద్రతా బలగాలు ఏ విధంగా స్పందించాలి, బందీలను సురక్షితంగా ఎలా విడిపించాలి, ప్రమాదాన్ని ఎలా అదుపులోకి తీసుకురావాలి అనే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. విమానాశ్రయాల భద్రత దేశ రక్షణ వ్యవస్థలో కీలకమైన భాగం కావడంతో ఇలాంటి ముందస్తు సాధనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

జవహర్ నగర్ డంప్ యార్డ్ తరలింపు కోసం రాజీలేని పోరాటం

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కారణంగా నరకయాతన అనుభవిస్తున్న లక్షలాది మంది ప్రజల సమస్యను పరిష్కరించే వరకు రాజీపడే ప్రసక్తే లేదని, రేపటి నుంచే బాధిత ప్రజలతో కలిసి పాదయాత్రకు శ్రీకారం చుడుతున్నామని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

పార్లమెంట్ సభ్యులు ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్, అక్టోబర్ 26 (విశ్వం న్యూస్) :

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు అంశంపై బేగంపేట్‌లోని టూరిజం ప్లాజాలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ మొత్తం ఆదాయంలో 70 శాతం ఆదాయం వచ్చేది ఈ ప్రాంతం నుంచేనని నాకు తెలుసు. గట్లాంటి ఈ నగరంలో ఇయ్యాల లక్షల మంది ప్రజలు కాలుష్యంతో బతుకు ఈడుస్తా ఉన్నారు. దీనికి పరిష్కారం కావాలని చెప్పి నేను పార్లమెంట్‌లో మాట్లాడినా. పార్లమెంట్‌లో మాట్లాడడమే కాకుండా (మిగతా 2వ పేజీలో)





యంగ్ ఇండియా పాఠశాలకు శంకుస్థాపన

జగిత్యాల, అక్టోబర్ 26 (విశ్వం న్యూస్) :

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న యంగ్ ఇండియా సమగ్ర పాఠశాలల నిర్మాణంలో భాగంగా జగిత్యాల జిల్లా తాటిపల్లిలో భారీ విద్యా సముదాయానికి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ పాఠశాలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లోనూ ఆధునిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్మాణం పూర్తయితే జగిత్యాల జిల్లా విద్యారంగంలో కీలకమైన మార్పు నకు అవకాశం ఏర్పడనుంది. తాటిపల్లిలో 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ సమగ్ర పాఠశాలో సుమారు 2,600 మంది (మిగతా 2వ పేజీలో)

సింగరేణిని మరింత బలోపేతం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులతో సమీక్షించారు. బొగ్గు రవాణా, రేకుల లభ్యత, డిస్పాచ్ వివరాల గురించి ఆయన మాట్లాడారు. ఓపెన్‌కాస్ట్, భూగర్భ గనుల్లో ఉత్పత్తి పరిస్థితులపై సమీక్షించారు. బొగ్గు ఉత్పత్తి పెంపు, రవాణా వేగవంతం, లక్ష్యాల సాధనపై అధికారులతో చర్చించారు. సింగరేణి భవిష్యత్ విస్తరణ, కొత్త గనుల అభివృద్ధి ప్రణాళికలపై సమాలోచనలు చేశారు. సంస్థ ఉత్పాదకత, సామర్థ్యం పెంపు, కార్యాచరణ మెరుగుదలపై భట్టి విక్రమార్క.. అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కొరియాతో బంధానికి సర్కారు ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక భాగస్వామ్యానికి పునాది వేశాయని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొరియా ఆర్థిక ప్రగతి నుంచి తెలంగాణ నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని, విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సాంకేతికతపై నిరంతర పెట్టుబడులు అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. తెలంగాణ పర్యాటక విధానం 2025--2030 ద్వారా రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, అదనంగా మూడు లక్షల ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కొరియా సంస్కృతి, కళలు, సంగీతం, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుక రెండు దేశాల ప్రజల మధ్య స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. యుద్ధం, పేదరికం వంటి సవాళ్లను అధిగమించి కొరియా ప్రపంచంలోని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగిందని కొనియాడారు. కొరియన్ సంగీతం, సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా యువతను ఆకర్షిస్తున్నాయని, సాంస్కృతిక ప్రభావం కూడా ఒక దేశ అంతర్జాతీయ గుర్తింపును పెంపొందిస్తుందని పేర్కొన్నారు. భారత్, కొరియా ప్రజల మధ్య విద్య, కుటుంబ వ్యవస్థ, సంప్రదాయాలు, పెద్దల పట్ల గౌరవం వంటి అంశాల్లో సారూప్యతలు ఉన్నాయని తెలిపారు.


కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి ఖర్గే వ్యాఖ్యలే నిదర్శనం: బండి

హైదరాబాద్, అక్టోబర్ 26 (విశ్వం న్యూస్) :

ప్రధాని మోదీపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి ఖర్గే వ్యాఖ్యలే నిదర్శనమని మండిపడ్డారు.“ మోదీ వ్యక్తిగత జీవితం, కుటుంబాన్ని విమర్శలకు వాడుకోవడం దుర్మార్గం. ఆయన చిన్నతనంలో ఎదుర్కొన్న పేదరికాన్ని ఎగతాళి చేయడం దారుణం. మోదీ తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేసి రాజకీయాల్లోకి లాగడం నీచం. ప్రజలకు చెప్పుకోవడానికి ఏమీ లేకే కాంగ్రెస్ పార్టీ అవమానకరమైన వ్యాఖ్యలు చేస్తోంది.

భూ కబ్జా భాగోతం!

మెదక్ ప్రతినిధి , 26 అక్టోబర్, (విశ్వం న్యూస్):



హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసి, తమ పట్టా సర్వే నంబర్‌ను చూపించి, దానికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 119/1లోని ప్రభుత్వ భూమిని అమాయకులకు విక్రయించి కోట్లాది రూపాయలు అక్రమంగా ఆర్జించినట్లు తెలుస్తోంది. అంటే పట్టా భూమి పేరుతో ప్రభుత్వ భూమిని విక్రయిస్తూ అమాయకులను మోసం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ అక్రమ కబ్జా, విక్రయాలపై రెవెన్యూ, తహశీల్దార్ అధికారులు తక్షణమే స్పందించాలని, సర్వే నంబర్ 119/1లోని భూమిని క్షేత్రస్థాయిలో సర్వే చేయించి, ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని, కబ్జాదారులపై, అక్రమ రిజిస్ట్రేషన్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు

రాహుల్ గాంధీకి తెలంగాణ ఏటీఎం

(మొదటి పేజీ తరువాయి)

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య విభజనలు సృష్టిస్తుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటున్నదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, కుంభకోణాలపై స్పందించకుండా మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, 13 డిక్లరేషన్లను నెరవేరుస్తామని, మొత్తం 420 హామీలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ ప్రజలకు మాట ఇచ్చారని గుర్తుచేశారు. వెయ్యి రోజులు గడుస్తున్నా ఆ హామీల అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ ఛార్మోంకీ గూంజ్ వంటి కార్యక్రమాల గురించి మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే ధైర్యం ఎందుకు లేదని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉన్నదన్నారు. ఎన్నికలకు ముందు అశోక్‌నగర్‌లో టీ స్టాల్ వద్ద కూర్చొని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చిన ఆయన.. ఇప్పుడు వారి సమస్యలను పట్టించుకోవడం లేదని నిలదీశారు.

జవహర్ నగర్ డంప్ యార్డ్..

(మొదటి పేజీ తరువాయి)

గతంలో మంత్రి కేటీఆర్ దగ్గరికి కూడా పోయి చెప్పినా. ఇన్ని లక్షల కోట్ల బడ్జెట్ పెడుతున్న ఈ కాలంలో జవహర్ నగర్ కంపునకు శాశ్వత పరిష్కారం చూపాలంటే.. సమగ్రమైన ప్రణాళికలతో రండి అని చెప్పి, నన్ను ఢిల్లీలో ఎట్లా చేస్తున్నారో చూసి రమ్మన్నారు. ఢిల్లీకి పోయి కోట్ల కొద్దీ టన్నుల వేస్ట్‌ను వాళ్లు జీరో ఎట్లా చేస్తున్నారో చూసినం. కానీ వాళ్లు స్పష్టంగా ఒక మాట చెప్పిండ్రు.. చెత్తను జీరో చేస్తున్నాం కానీ, గత 10-20 ఏండ్ల నుంచి అక్కడ ఏ భూగర్భ జలాలైతే పాయిజన్ అయినాయో వాటిని పూర్తిగా శుద్ధి చేయాలంటే చాలా సమయం పడుతుందని చెప్పిండ్రు. ఇవాళ జవహర్ నగర్‌లో ఉన్న రెండు మూడు కోట్ల టన్నుల చెత్తను రాత్రికి రాత్రే తీసేసినా.. వెంటనే లక్ష్మీ నారాయణ చెరువో, చీరాల చెరువో బాగుపడవు, దానికి టైం పడుతుంది. అందుకే సీఎం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఒక నిర్ణయం తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు. లక్షలాది మంది ప్రజల భాగస్వామ్యంతో, ప్రజాక్షేత్రంలోనే ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని, సమస్య పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించి, అవసరమైతే రూ.2000 నుంచి రూ.3000 కోట్లు కేంద్ర నిధులు తీసుకొచ్చే బాధ్యత నేను తీసుకుంటానని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి రాజకీయాలను పక్కనబెట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రముఖ పర్యావరణ వేత్త పురుషోత్తం రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కాలుష్యం అనేది కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతమైన ప్రజా సమస్య అని, గాలి-నీరు కలుషితమైతే సమాజంలో ప్రతి ఒక్కరూ బాధితులు కావాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాల కోసం ఎన్ని ఆస్తులు, ప్లాట్లు, ఫామ్‌హౌస్‌లు సమకూర్చుకున్నా.. వారికి పీల్చేందుకు స్వచ్ఛమైన గాలి, తాగేందుకు స్వచ్ఛమైన నీరు అందించలేకపోతే వాటన్నింటికీ విలువే ఉండదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఎన్విరాన్మెంటలిస్టులు దొంతి నరసింహ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, దామోదర్ రెడ్డి, మాజీ మేయర్ బండ కార్తీక్ రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎన్ఎఫ్ఐ మాజీ డిజిఎం హనుమంత రెడ్డి, ఎస్బిహెచ్ ఫార్మర్ బోర్డ్ డైరెక్టర్ పంపాలా నరసింహ, ఎంఆర్పిఎస్ ప్రతినిధి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎదులాబాద్ నుంచి గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మింగరాజు, రజక సంఘం అధ్యక్షుడు వెంకటేష్, యాంటీ డంప్యాడ్ జేఏసీ కన్వీనర్ డాక్టర్ శంకర నారాయణ, కో కన్వీనర్లు మారం సమ్మిరెడ్డి, ఏనుగు సంజీవరెడ్డి, దమ్మైగూడ నుంచి ఓరుగంటి కృష్ణ కిషోర్, ఎదులాబాద్ మాజీ సర్పంచ్, మూసి పరిరక్షణ సమితి అధ్యక్షుడు బట్టి శంకర్, రైన్ వాటర్ హార్వెస్ట్ ఎక్స్పెక్ట్ సుభాష్ రెడ్డి, ఈ డంప్ యార్డుకి వ్యతిరేకంగా పోరాడుతున్న బీజేపీ నాయకులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, తిరుమల రెడ్డి, విక్రమ్ రెడ్డి, కోర్టులో వాదిస్తున్న అడ్వకేట్ కౌశిక్ పాల్గొన్నారు.

ఉగ్రవాదంపై ఉమ్మడి పోరుకు ఇరు దేశాల చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో భారత, రష్యా పార్లమెంటరీ ప్రతినిధి బృందాల మధ్య కీలక చర్చలు జరిగాయి. లోక్‌సభ స్పీకర్ రష్యా పార్లమెంటరీ ప్రతినిధి బృందంతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఇరు దేశాల మధ్య పార్లమెంటరీ సంబంధాలను మరింత బలోపేతం చేయడం, అంతర్జాతీయ వేదికలపై పరస్పర సహకారాన్ని పెంపొందించడం వంటి అంశాలపై చర్చించారు. బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని విస్తరించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి పార్లమెంటరీ స్థాయిలో సమన్వయం అవసరమని ఈ సమావేశం ప్రాధాన్యాన్ని చాటింది. భారత్, రష్యా పార్లమెంటరీ ప్రతినిధులు అంతర్జాతీయ వేదికలపై పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకునే అంశంపై చర్చించారు. ప్రపంచ దేశాల మధ్య సహకారం పెంపొందించడంలో పార్లమెంటరీ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు దేశాలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఉగ్రవాద కార్యకలాపాలను నిరోధించడం, వాటికి సహకరించే వ్యవస్థలను అడ్డుకోవడం, అంతర్జాతీయ స్థాయిలో సమాచార మార్పిడిని మెరుగుపరచడం వంటి అంశాల్లో దేశాల మధ్య సమన్వయం ముఖ్యమని చర్చించారు. ఉగ్రవాదం ప్రపంచ శాంతి, భద్రతలకు సవాలుగా మారుతున్న నేపథ్యంలో దానిని ఎదుర్కొనేందుకు ఉమ్మడి కార్యాచరణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇరు దేశాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాలన్న అంశంపై రష్యా అందిస్తున్న మద్దతును లోక్‌సభ స్పీకర్ ప్రశంసించారు. ప్రపంచ వ్యవహారాల్లో భారత్ పాత్ర, అంతర్జాతీయ శాంతి భద్రతల పరిరక్షణలో దేశం అందిస్తున్న సహకారం దృష్ట్యా భద్రతా మండలి నిర్మాణంలో సంస్కరణల అవసరం ఉందన్న చర్చలకు ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా అంతర్జాతీయ సంస్థల్లో ప్రాతినిధ్యాన్ని విస్తరించాలనే డిమాండ్లు వివిధ దేశాల నుంచి వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ శాశ్వత సభ్యత్వానికి రష్యా మద్దతు ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక, దౌత్య సంబంధాల్లో ముఖ్యమైన అంశంగా నిలుస్తోంది. అయితే భద్రతా మండలి విస్తరణ, సభ్యత్వ మార్పులకు సంబంధించి ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన విధానాల ప్రకారం అంతర్జాతీయ స్థాయిలో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. భారత్, రష్యా మధ్య పార్లమెంటరీ ప్రతినిధి బృందాల పరస్పర పర్యటనలను క్రమం తప్పకుండా నిర్వహించాలని లోక్‌సభ స్పీకర్ ప్రాధాన్యం ఇచ్చారు. ఇరు దేశాల ప్రజాప్రతినిధులు పరస్పరం అనుభవాలను పంచుకోవడం ద్వారా శాసన ప్రక్రియలు, ప్రజాస్వామ్య వ్యవస్థలు, ప్రజాప్రతినిధుల బాధ్యతలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువ పార్లమెంటు సభ్యులు, మహిళా ప్రజాప్రతినిధుల మధ్య చర్చలు, పరస్పర పరిచయ కార్యక్రమాలను ప్రోత్సహించాలని సూచించారు. యువతకు ప్రజాస్వామ్య వ్యవస్థలపై అవగాహన కల్పించడం, మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, ప్రజాప్రతినిధుల మధ్య నిరంతర సంభాషణకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలు ఈ చర్చల్లో ప్రాధాన్యం పొందాయి.

ఎల్‌నినో వేళ ప్రత్యామ్నాయ పంటలే మేలు!

(మొదటి పేజీ తరువాయి)

కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని రాయికల్, విట్యాల, రామేశ్వరం గ్రామాల్లో ఆయన డైరెక్టర్ ((ప్రాజెక్టులు, సమాచార సాంకేతిక విభాగం) వి. శివాజీతో కలిసి ఆకస్మిక క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితులను పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వరి సాగుకు అధిక మొత్తంలో నీరు అవసరమయ్యే నేపథ్యంలో రైతులు తమ భూమి స్వభావం, నీటి వనరులు, పెట్టుబడి సామర్థ్యాన్ని బట్టి ఇతర పంటలను కూడా పరిశీలించాలని సీఎండీ సూచించారు. చిన్న విస్తీర్ణంలోనూ ఆకుకూరలు, మునగ, కూరగాయలు, పూల తోటలు వంటి పంటలను సాగు చేసి ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలను అన్వేషించాలని తెలిపారు. ఒకటి, రెండు గుంటల భూమి నుంచి ఎకరం, రెండు ఎకరాల విస్తీర్ణం వరకు అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవచ్చని వివరించారు. పంటల సాగుతోపాటు పాడి పరిశ్రమ, చేపల పెంపకం, గొర్రెల పెంపకం, కోళ్ల పెంపకం వంటి అనుబంధ రంగాల ద్వారా అదనపు ఆదాయం పొందే మార్గాలను కూడా పరిశీలించాలని సూచించారు. అయితే ఏ పంటను ఎంచుకోవాలన్నది స్థానిక నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ గిరాకీ, సాగు ఖర్చులపై ఆధారపడి ఉంటుందని, రైతులు వ్యవసాయ నిపుణుల సలహాలతో నిర్ణయాలు తీసుకోవడం ప్రయోజనకరమని పేర్కొన్నారు. వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

షాద్‌నగర్ ప్రాంతంలో పనిచేస్తున్న ఖేయిటీ సంస్థ పరిశోధన, అభివృద్ధి బృందంతో సీఎండీ ప్రత్యేకంగా చర్చించారు. తక్కువ భూమిలో, పరిమిత నీటితో వివిధ రకాల పంటలు, కూరగాయలను సాగు చేస్తూ పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా మెరుగైన ఆదాయం పొందే అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన ఆధునిక సాగు పద్ధతులు, నీటి సమర్థ వినియోగం, పంటల వైవిధ్యం వంటి అంశాలపై చర్చించారు. చిన్న రైతులు సైతం అందుబాటులో ఉన్న భూమి, నీటి వనరులను సద్వినియోగం చేసుకుని ఆదాయాన్ని పెంచుకునేలా ఆచరణాత్మక పద్ధతులను పరిశీలించాలని సూచించారు. అనంతరం విట్యాల గ్రామంలో ఓ రైతు నిర్వహిస్తున్న పాడి పరిశ్రమను సందర్శించి, పశువుల సంరక్షణ, పాడి షెడ్డులోని సదుపాయాలు, నిర్వహణ విధానం, పాల విక్రయం ద్వారా లభిస్తున్న ఆదాయం గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ వంటి అనుబంధ రంగాలను చేపట్టడం ద్వారా రైతులు ఆదాయ వనరులను విస్తరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వ్యవసాయ విద్యుత్ సరఫరాకు ఉపయోగిస్తున్న పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును సీఎండీ పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ దెబ్బతినడానికి గల కారణాలు, విద్యుత్ లైన్లలో తలెత్తుతున్న సమస్యలు, సరఫరాలో అంతరాయాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన సాంకేతిక చర్యలపై అధికారులతో సమీక్షించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరా సక్రమంగా అందేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యుత్ పరికరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించడం, మరమ్మతులు అవసరమైన చోట వెంటనే స్పందించడం ద్వారా సరఫరాలో అంతరాయాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులు కీలకంగా ఉండే సమయాల్లో విద్యుత్ సరఫరా సమస్యలు రైతులకు ఇబ్బందులు కలిగించకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

యంగ్ ఇండియా పాఠశాలకు శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులకు విద్యాబోధన అందించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడి యట్ వరకు చదువుకునే అవకాశం కల్పించడంతో పాటు విద్యార్థులకు అవసరమైన ఆధునిక వసతులను సమకూర్చను న్నారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర విద్యా సదుపాయాలతో కూడిన సమగ్ర ప్రాంగణంగా దీనిని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్యార్థులు చదువులో రాణించేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, వారి ప్రతిభను వెలికితీయడం, ఉన్నత విద్యకు అవసరమైన పునాది బలంగా వేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నా రు. పాఠశాల నిర్మాణ పనులను 18 నెల్లో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తయ్యేలా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంటుంది. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా నాణ్యమైన విద్యకు దూరమయ్యే పరిస్థితి విద్యార్థులకు రాకూడదని, ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే మెరుగైన బోధనతో పాటు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. విద్య అనేది ప్రతి విద్యార్థికి సమానంగా అందాల్సిన అవకాశమని, కుటుంబ ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా పిల్లలు తమ లక్ష్యాలను చేరుకునేలా విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమగ్ర పాఠశాలల ద్వారా విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో వివిధ విద్యా సదుపాయాలు కల్పించడం, చదువుపై ఆసక్తి పెంచడం, ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించడం సాధ్యమవుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ తరహా నిర్మాణాలు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలను చేరువ చేయడంలో దోహదపడతాయని భావిస్తున్నారు. జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి సుమారు రూ.500 కోట్లతో వివిధ పనులు కొనసాగుతున్నాయని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహార భత్యాలను 40 శాతం, వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన ఖర్చుల భత్యాలను 200 శాతం పెంచినట్లు వివరించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, చదువుపై ఏకాగ్రతకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో ఈ నిర్ణయాలు ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు. పాఠశాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, తరగతి గదుల మెరుగుదల, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలంటే నాణ్యమైన బోధనతో పాటు తల్లిదండ్రుల్లో నమ్మకం పెంపొందించడం కూడా ముఖ్యమని విద్యారంగ నిపుణులు పేర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో నిర్మాణ పనులు నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం కీలకంగా మారనుంది. తాటిపల్లిలో యంగ్ ఇండియా సమగ్ర పాఠశాల నిర్మాణం పూర్తయితే జగిత్యాల జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. అయితే భవనాల నిర్మాణంతోపాటు అర్హులైన ఉపాధ్యాయుల నియా మకం, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, క్రీడా సదుపాయాల నిర్వహణ, విద్యార్థుల భద్రత, పరిశుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు వంటి అంశాలపై కూడా సమానంగా దృష్టి సారించాల్సి ఉంటుంది. పాఠశాల ప్రారంభమైన తర్వాత విద్యా ప్రమాణాలను నిరంతరం సమీక్షించడం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచే కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆశించిన ఫలితాలను సాధించవచ్చు. ప్రభుత్వం చేపడుతున్న విద్యారంగ అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో విద్యార్థులకు ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తాయన్నది వాటి అమలు, నిర్వహణపై ఆధారపడి ఉంటుంది.

www.vishwamnews.com
విశ్వం న్యూస్

సంపాదకీయం

మోహన్ భగవత్ దిగజారుడుతనం

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అధినేతగా వ్యవహరిస్తున్న మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ ఆలోచనా ధోరణిని మరోసారి బయటపెట్టాయి. ప్రభుత్వాలు మారినంత మాత్రాన పరిస్థితులు మారవని, ప్రజా ఉద్యమాల ద్వారా వ్యవస్థలో మార్పు సాధ్యం కాదనే అర్థం వచ్చేలా ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయి. ప్రజల ఆకాంక్షలను, వారి పోరాటాలను అనుమానాస్పదంగా చిత్రీకరించడం ఒక సామాజిక సంస్థ అధినేతకు తగిన వైఖరి కాదు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలనే మౌలిక సూత్రాన్ని విస్మరించి మాట్లాడడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఏర్పడి నూట ఒక్క సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంలో ఆ సంస్థ అధినేత చేసిన వ్యాఖ్యలను ఆ సంస్థ చరిత్రతో కలిపి పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఆర్ఎస్ఎస్ తనను తాను సాంస్కృతిక, సామాజిక సంస్థగా అభివర్ణించుకుంటుంది. అయితే దేశ రాజకీయ పరిణామాల్లో ఆ సంస్థ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో జోక్యం చేసుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. రాజకీయాలకు అతీతమని చెప్పుకుంటూనే రాజకీయ అధికారాన్ని ప్రభావితం చేయడానికి ప్రయత్నించడం ఆ సంస్థ చరిత్రలో కనిపించే వైరుధ్యం. 1975లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించినప్పుడు ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించారు. ఆ సమయంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం సాగిన ఉద్యమాల్లో ఆ సంస్థకు చెందిన కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ నాయకత్వంలో జరిగిన ఉద్యమానికి వివిధ రాజకీయ, సామాజిక శక్తులు మద్దతు తెలిపాయి. 1977 ఎన్నికల్లో ఇందిరాగాంధీ ప్రభుత్వం ఓటమి చెంది జనతా పార్టీ అధికారంలోకి రావడానికి ఆ ప్రజా ఉద్యమం ముఖ్యమైన రాజకీయ నేపథ్యంగా నిలిచింది. అంటే ప్రజా ఉద్యమాల ద్వారా ప్రభుత్వాలు మారిన చరిత్ర భారతదేశంలోనే ఉంది. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పాలకులు వ్యవహరించినప్పుడు వారిని మార్చే శక్తి ప్రజలకు ఉందని ఆనాటి పరిణామాలు నిరూపించాయి. అప్పుడు ప్రజా ఉద్యమాలను సమర్థించిన శక్తులు ఇప్పుడు ఉద్యమాల ప్రాధాన్యాన్ని తగ్గించి మాట్లాడడం రాజకీయ అవకాశవాదం కాక మరేమిటి? అంతేకాదు, 2011లో అవినీతికి వ్యతిరేకంగా అన్నా హజారే నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఉద్యమం జరిగింది. ఆ ఉద్యమానికి వివిధ రాజకీయ, సామాజిక సంస్థల నుంచి మద్దతు లభించింది. ఆర్ఎస్ఎస్‌కు చెందిన వర్గాలు కూడా ఆ ఉద్యమానికి అనుకూలంగా వ్యవహరించాయి. అప్పటి కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి రాజకీయ మార్పుకు దారితీసిన అనేక అంశాల్లో ఒకటిగా నిలిచింది. ఆ తరువాత 2014లో కేంద్రంలో అధికార మార్పు జరిగింది. ఈ చరిత్రను పరిశీలిస్తే ప్రజా ఉద్యమాల ప్రాధాన్యాన్ని ఆర్ఎస్ఎస్ గతంలో గుర్తించిన విషయం స్పష్టమవుతుంది. అయితే ఇప్పుడు అదే సంస్థ అధినేత మోహన్ భగవత్ ప్రభుత్వ మార్పుతో పరిస్థితులు మారవంటూ వ్యాఖ్యానించడం ఆశ్చర్యకరం. తమకు అనుకూలంగా ఉద్యమాలు జరిగినప్పుడు వాటిని ప్రజాస్వామ్య విజయాలుగా అభివర్ణించి, తమకు అనుకూలమైన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉద్యమాలపై అనుమానాలు వ్యక్తం చేయడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు శాశ్వతం కాదు. ప్రజలే శాశ్వతం. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయకపోతే ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంటుంది. నిరసనలు తెలపడం, ఆందోళనలు నిర్వహించడం, ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడం రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య స్ఫూర్తిలో భాగం. శాంతియుతంగా జరిగే ఉద్యమాలను దేశానికి వ్యతిరేకమైన చర్యలుగా చిత్రీకరించడం ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరుస్తుంది. నేపాల్, బంగ్లాదేశ్, ఫ్రాన్స్ వంటి దేశాల్లో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ అధికార మార్పు వల్ల సమస్యలు పరిష్కారం కావని మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. ఆయా దేశాల్లో నెలకొన్న రాజకీయ, సామాజిక పరిస్థితులు భిన్నమైనవి. వాటిని భారతదేశ ప్రజాస్వామ్య పరిస్థితులతో ఒకే గాటన కట్టడం సరైన విశ్లేషణ కాదు. ప్రజా ఉద్యమాలు ప్రతిసారీ ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవచ్చు. కానీ అందువల్ల ఉద్యమాల అవసరమే లేదని నిర్ధారించడం చరిత్రను తిరస్కరించడమే అవుతుంది. దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక అసమానతలు, సామాజిక వివక్ష వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. వీటికి పరిష్కారాలు కోరుతూ ప్రజలు ఉద్యమిస్తే వారి సమస్యలను అర్థం చేసుకోవాలి. ప్రజల అసంతృప్తికి కారణమైన పరిస్థితులను మార్చడానికి ప్రభుత్వాలు ప్రయత్నించాలి. అంతేకానీ ఆ అసంతృప్తి వెనుక విదేశీ శక్తుల కుట్ర ఉందంటూ ప్రతి ఉద్యమాన్నీ అనుమానించడం సమంజసం కాదు. విదేశీ జోక్యానికి సంబంధించిన ఆరోపణలు ఉంటే వాటికి ఆధారాలు చూపాలి. ఆధారాలు లేకుండా ఉద్యమాలపై ముద్రలు వేయడం ప్రజల న్యాయమైన డిమాండ్లను పక్కదారి పట్టించడమే అవుతుంది. ప్రజాస్వామ్యంలో అధికార పక్షానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో ప్రతిపక్షాలకు, ప్రజాసంఘాలకు, పౌర సమాజానికి కూడా అంతే ప్రాధాన్యం ఉంటుంది. ప్రభుత్వం చేసే ప్రతి పనినీ సమర్థించడం దేశభక్తి కాదు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడం దేశద్రోహం అంతకన్నా కాదు. ప్రభుత్వాన్ని విమర్శించడం, దేశాన్ని వ్యతిరేకించడం రెండూ వేర్వేరు విషయాలు. ఈ తేడాను గుర్తించలేని రాజకీయ ధోరణి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. భారత స్వాతంత్ర్య ఉద్యమం మొదలుకొని భూసంస్కరణలు, కార్మిక హక్కులు, సామాజిక న్యాయం, విద్యాహక్కు వరకు దేశంలో సాధించిన అనేక విజయాల వెనుక ప్రజా పోరాటాల చరిత్ర ఉంది. రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, అణగారిన వర్గాలు పోరాడకుండానే వారికి హక్కులు లభించలేదు. ఉద్యమాలు లేకుండా సమాజంలో మార్పు సాధ్యమై ఉంటే చరిత్ర మరోలా ఉండేది. ప్రభుత్వ మార్పు ఒక్కటే సమాజంలోని సమస్త సమస్యలకు పరిష్కారం కాదనే అభిప్రాయంతో విభేదించాల్సిన అవసరం లేదు. నిజమే, పాలకులు మారినంత మాత్రాన వ్యవస్థలోని అసమానతలన్నీ తొలగిపోవు. అందుకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో నిర్మాణాత్మక మార్పులు అవసరం. అయితే ఈ వాస్తవాన్ని ఆధారంగా చేసుకొని ప్రజలకు పాలకులను మార్చే హక్కు లేదన్నట్లుగా మాట్లాడటం మాత్రం అంగీకారయోగ్యం కాదు. ప్రభుత్వ మార్పు ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక భాగం. సామాజిక మార్పు నిరంతర ప్రజా చైతన్యం ద్వారా సాధించాల్సిన లక్ష్యం. ఈ రెండింటినీ పరస్పర విరుద్ధంగా చూడరాదు.దేశాన్ని బలపరచడం అంటే పాలకులను ప్రశ్నించకుండా ఉండటం కాదు. పాలకులు రాజ్యాంగానికి, ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చూడటమే నిజమైన దేశభక్తి. ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడం అవసరమే. అయితే ఐక్యత పేరుతో భిన్నాభిప్రాయాలను అణచివేయడం సమర్థనీయం కాదు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజం. వాటిని గౌరవించే రాజకీయ సంస్కృతి అవసరం. మోహన్ భగవత్ వంటి ఒక పెద్ద సంస్థ అధినేత సమాజానికి మార్గదర్శకంగా నిలవాలంటే ప్రజల ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలి. ప్రభుత్వాలకు అతీతంగా రాజ్యాంగ విలువలను సమర్థించాలి. ప్రజలను పాలకుల అనుచరులుగా కాకుండా స్వతంత్ర నిర్ణయాధికారం కలిగిన పౌరులుగా గుర్తించాలి. అధికారంలో ఎవరున్నా ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిందే. ప్రజలు ప్రశ్నిస్తారు, నిరసిస్తారు, పోరాడతారు. అవసరమైతే ఎన్నికల ద్వారా ప్రభుత్వాలను మారుస్తారు. ఇదే ప్రజాస్వామ్య బలం. ఆ హక్కును తక్కువ చేసి చూపే ప్రయత్నం ఎంత పెద్ద సంస్థ అధినేత చేసినా అది విమర్శకు అతీతం కాదు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అధినేతలు. పాలకులు వారి సేవకులు మాత్రమే. ఈ సత్యాన్ని విస్మరించి ప్రజా ఉద్యమాలను కించపరిచే స్థాయికి దిగజారడం మోహన్ భగవత్ వంటి నాయకుడికి తగదు. ఆర్ఎస్ఎస్ అధినేతగా ఆయన తన సంస్థ ప్రయోజనాల గురించి ఆలోచించవచ్చు. కానీ భారత ప్రజాస్వామ్య భవిష్యత్తును నిర్ణయించే అధికారం ప్రజలకే ఉందనే వాస్తవాన్ని ఎవరూ తిరస్కరించలేరు.

గీతం విద్యార్థులకు సమగ్ర కెరీర్ మద్దతు

మూడు ప్రత్యేక విభాగాలు

టీఎంసీజీ బలోపేతం

శిక్షణ, సామర్థ్య వృద్ధి

కెరీర్ కౌన్సెలింగ్, మెంటరింగ్

ప్రత్యామ్నాయ కెరీర్ మార్గాలు

కొత్తగా అధికారుల నియామకం

సంగారెడ్డి ప్రతినిధి, 26 అక్టోబర్, (విశ్వం న్యూస్):

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు, భవిష్యత్తు అవసరాలకు తర్ఫీదు ఇచ్చేందుకు, వారి నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేసింది. వృత్తి సలహా కేంద్రం (జీసీజీసీ) లోని శిక్షణ, మార్గదర్శకత్వం, వృత్తి సలహాల (టీఎంసీజీ) విభాగాన్ని బలోపేతం చేసి, శిక్షణ, మెంటరింగ్, ప్రత్యామ్నాయ కెరీర్ మార్గదర్శకత్వం కోసం మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. టీఎంసీజీ డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ ప్రకారం, గీతం మూడు క్యాంపస్ లలో ప్రత్యేక సంప్రదింపు వ్యక్తులను నియమించడం ద్వారా విద్యార్థులకు వారి విద్యా, వృత్తి ప్రయాణంలో స్థిరమైన, సుసంఘటిత మద్దతును అందిస్తున్నారు. శిక్షణ, సామర్థ్య అభివృద్ధి (టీసీడీ) విభాగం, కంపెనీ-నిర్దిష్ట శిక్షణ, గ్లోబల్ సర్టిఫికేషన్లు, ఏఐ-ఆధారిత ప్రాక్టీస్ ప్లాట్‌ఫారాలు, జీసీజీసీ క్రెడిట్ కోర్సులు, నిపుణుల నేతృత్వంలోని నైపుణ్యాభివృద్ధి సెషన్లు, కోక్యూబ్స్, సీటీ3 అసెస్ మెంట్లు, హ్యాకథాన్ ల ద్వారా విద్యార్థులను పరిశ్రమకు సిద్ధం చేస్తుంది. కెరీర్ కౌన్సెలింగ్, మెంటరింగ్ (సీసీఎం) విభాగం, అధ్యాపకులు, నిపుణుల మార్గదర్శకత్వం, కెరీర్ కౌన్సెలింగ్, బలాలు, ఆసక్తులను గుర్తించడం, వ్యక్తిగతీకరించిన కెరీర్ ప్రణాళికను అందిస్తుంది. ప్రత్యామ్నాయ కెరీర్ సేవలు (ఏసీఎస్) విభాగం, విదేశీ విద్య, క్యాట్, గేట్, ఐఐటీ జామ్, జీపాట్, సీఎస్ఐఆర్ నెట్ వంటి పోటీ పరీక్షలు, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్, ఇతర ప్రభుత్వ, రక్షణ రంగ ఉద్యోగాల వైపు విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తుంది. ప్రతి విభాగానికి కేంద్ర సమన్వయకర్తలను నియమించారు. ఆర్. సంపత్ కుమార్, ఎ.ఎస్. పద్మజ అసిస్టెంట్ డైరెక్టర్లుగా, జి. విష్ణుప్రియ అసిస్టెంట్ మేనేజర్‌గా శిక్షణ, సామర్థ్య అభివృద్ధి కార్యకలాపాలను సమన్వయం చేస్తారు. ప్రొఫెసర్ పి. సరిత డిప్యూటీ డైరెక్టర్ గా, రంజనా ఫెర్నాండో డిప్యూటీ మేనేజర్‌గా కెరీర్ కౌన్సెలింగ్, మెంటరింగ్ విభాగానికి నాయకత్వం వహిస్తారు. డాక్టర్ బి. రవికాంత్ డిప్యూటీ డైరెక్టర్ గా ప్రత్యా మ్నాయ కెరీర్ సేవలు విభాగానికి అధిపతిగా ఉంటారు. విద్యార్థులు సరైన సహాయాన్ని సులభంగా పొందేందుకు, విశ్వవిద్యాలయ మూడు క్యాంపస్ లలో క్యాంపస్-స్థాయి సంప్రదింపు వ్యక్తులను కూడా నియమించినట్లు డాక్టర్ రోజీనా వివరించారు, ఈ కార్యక్రమం, ప్రతి విద్యార్థికి అందుబాటులో ఉండే, వ్యక్తిగతీకరించిన, సమగ్రమైన కెరీర్ మద్దతును అందించాలనే తమ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆమె పేర్కొన్నారు.

టీఎన్జీవోస్ నూతన కార్యవర్గానికి మంత్రి, కలెక్టర్ అభినందనలు

నూతన కార్యవర్గ ఎన్నిక
మంత్రి, కలెక్టర్ ఆకాంక్షలు

ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం.. సమస్యల పరిష్కారానికి కృషి

సంగారెడ్డి ప్రతినిధి, 26 అక్టోబర్, (విశ్వం న్యూస్):





టీఎన్జీవోస్ సంగారెడ్డి జిల్లా సంఘానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఐఏఎస్ అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు మరింత సమర్థవంతంగా పనిచేసేలా నూతన కార్యవర్గం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. మొహమ్మద్ జావిద్ అలీ జిల్లా అధ్యక్షులుగా, వేల్పూరు రవి వెంకట్ రెడ్డి జిల్లా కార్యదర్శిగా, శ్రీనివాస్, కసిని శ్రీకాంత్ ఎన్నిక కావడం పట్ల మంత్రి, కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. నూతన కార్యవర్గం ఉద్యోగుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య సమన్వయ వారధిగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా, న్యాయమైన హక్కుల సాధనకు కృషి చేస్తామని, పెండింగ్ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉద్యోగుల ఐక్యత బలోపేతం చేయడం, సంఘటిత శక్తిని పెంపొందించడం, సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్య పద్ధతుల్లో ముందుకు సాగడం తమ ప్రాధాన్యతలను స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులందరినీ సమన్వయంతో ముందుకు నడిపిస్తామని తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ ప్రతీక్ జైన్ అందించిన అభినందనలు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చాయని సంఘ నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం, ఐక్యత, హక్కుల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తూ టీఎన్జీవోస్ సంఘం ప్రతిష్ఠను పెంపొందిస్తామని నూతన కార్యవర్గం ధీమా వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో హెచ్ డబ్ల్యూ ఓ రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు రాష్ట్ర అధ్యక్షులు బలరాం విజయలక్ష్మి, నాగమణి, ప్రమోద్ కుమార్, పట్టణ అధ్యక్షులు యాదవ రెడ్డి, సెక్రెటరీ వెంకట్, వెంకటేశం, నాగేశ్వరరావు, రామప్ప, కిరణ్, గౌస్ హాస్మి, నవాజ్, నర్సింలు, దుర్గయ్య, ఇమ్రాన్ ఖాన్, నజీర్ హైమద్, 4వ తరగతి అధ్యక్ష కార్యదర్శులు మొహమ్మద్ షరీఫ్, నాగరాజు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసు ఫ్లాగ్ డే వ్యాసరచన పోటీలు, రివార్డులు

అమరవీరుల స్మరణలో వారోత్సవాలు

పోలీసు అధికారులు, సిబ్బందికి పోటీలు

విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన

ఉత్తమ వ్యాసాలకు రివార్డులు ఎస్పీ

సంగారెడ్డి ప్రతినిధి, 26 అక్టోబర్, (విశ్వం న్యూస్):



పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, అక్టోబరు 21 నుండి 31 వరకు జరిగే పోలీసు ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా, 2026 అక్టోబరు 26న సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ హైస్కూల్, శాంతినగర్‌లో పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసు అధికారులు "పౌరుల మన్ననలు పొందేందుకు పోలీసులు చేయాల్సిన కృషి, కింది స్థాయి పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడం" అనే అంశంపై, పోలీసు సిబ్బంది "ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుంచి ఎలాంటి సేవలను ఆశిస్తున్నారు?", "పోలీసు అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర -దాని వ్యసనాన్ని అధిగమించి వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాల కోసం సద్వినియోగం చేసుకోవడం ఎలా?" అనే అంశాలపై పోటీపడ్డారు. ఈ పోటీలకు 34 మంది హాజరయ్యారని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు వ్యాసాలను రివార్డుల కోసం ఎంపిక చేస్తామని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్, తెలి పారు. అదేవిధంగా, విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్న వ్యాస రచన పోటీల్లో "సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర", "తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర", "సైబర్ నేరాల నివారణలో పోలీసులు, పౌరుల పాత్ర", "డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర - విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఎలా దూరంగా ఉండగలరు?" వంటి అంశాలపై రాసిన వ్యాసాలను పరిశీలించి, ఉత్తమ వ్యాసాలను ఎంపిక చేసి విజేతలకు రివార్డులు అందజేయనున్నట్లు ఆయన వివరించారు.

'గురునానక్ మందిర్ కమాన్లకు' శంకుస్థాపన

కమాన్ల నిర్మాణానికి భూమిపూజ

హామీ నిలబెట్టుకున్న జగ్గారెడ్డి

మందిర సమస్యల పరిష్కార హామీ

నాగదేవత ఆలయ అభివృద్ధికి సూచన

కార్యక్రమంలో ప్రముఖుల భాగస్వామ్యం

నారాయణఖేడ్ నియోజకవర్గం, 26 అక్టోబర్, (విశ్వం న్యూస్):



సంగారెడ్డి పట్టణంలోని గురునానక్ మందిర్ వద్ద రెండు కమాన్ల నిర్మాణానికి జగ్గారెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. గత గురునానక్ జయంతి సందర్భాన ఇచ్చిన హామీ మేరకు, బ్రాహ్మణవాడలో మందిరం ప్రవేశ మార్గంలో ఒకటి, భవాని మందిర్ రోడ్డులో మరొక కమాన్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. అంతకుముందు మందిరాన్ని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన జగ్గారెడ్డి, మందిర్ ప్రతినిధులు వివరించిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మందిర ప్రాంగణంలోని రావిచెట్టు కింద ఉన్న నాగదేవత ఆలయాన్ని యథాస్థానంలో ఉంచి అభివృద్ధి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సర్దార్ సురేందర్ గోపి సింగ్, సర్దార్ తేజేందర్ సింగ్, సర్దార్ స్వరణ్ సింగ్, సర్దార్ సత్‌పాల్ సింగ్, డాక్టర్ సర్దార్ భరత్ సింగ్, సిక్కు గురువు గురుదేవ్ సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, నరేన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి స్ఫూర్తిదాయకం

ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో వేడుకలు

వాల్మీకి జీవితం పరివర్తనకు ప్రతీక చంటి ప్రభు

రామాయణం ధార్మిక విలువలకు మార్గదర్శకం

యువత వాల్మీకి ఆశయాలు ఆదర్శం చేసుకోవాలి



సంగారెడ్డి ప్రతినిధి, 26 అక్టోబర్, (విశ్వం న్యూస్):

బీజేపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు, సంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో మంజీరానగర్ ప్రాంతంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు చంటి ప్రభు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంటి ప్రభు మాట్లాడుతూ, వాల్మీకి కేవలం ఒక మహర్షి పేరు మాత్రమే కాదని, ఆయన గొప్ప ఆలోచన, పరివర్తన, స్ఫూర్తికి ప్రతీక అన్నారు. వాల్మీకిని భారతీయ సాహిత్యంలో ఆదికవిగా గౌరవిస్తామని, ఆయన రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, ధర్మం, నైతిక విలువలకు గొప్ప మార్గదర్శకమని కొనియాడారు. రామాయణం శ్రీరాముని జీవిత కథే కాక, జీవితంలో ఎలా నడుచుకోవాలి, కష్టాలను ఎలా ఎదుర్కోవాలి, ధర్మం కోసం ఎలా నిలబడాలి, సమాజం పట్ల బాధ్యతలను ఎలా నిర్వర్తించాలి అనే విలువైన విషయాలను బోధిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ వాల్మీకి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని, ముఖ్యంగా యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్య, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యతనిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఎస్సీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ హెచ్.డి. రవి, జిల్లా ప్రొఫెషనల్ సెల్ కన్వీనర్ పతంగి సత్యనారాయణ, అందోల్ అసెంబ్లీ లీగల్ సెల్ కన్వీనర్ అడ్వకేట్ కలాలి వినోద్ కుమార్ గౌడ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



వాల్మీకి ఆదర్శాలు స్ఫూర్తిదాయకం

కలెక్టర్ ప్రతీక్ జైన్ కీలక వ్యాఖ్యలు.. జయంతి వేడుకలు ఘనం

రామాయణ బోధనల గొప్పదనం.. మనిషిలో మార్పు సాధ్యం

సంగారెడ్డి ప్రతినిధి, 26 అక్టోబర్, (విశ్వం న్యూస్):

మహర్షి వాల్మీకి జీవితం, ఆదర్శాలు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వాల్మీకి జయంతి వేడుకల్లో కలెక్టర్ ప్రతీక్ జైన్ జ్యోతి ప్రజ్వలన, వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వాల్మీకి రచించిన రామాయణం మానవాళికి ధర్మం, సత్యం, న్యాయం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను బోధిస్తుందని వివరించారు. ఆయన జీవితం మనిషిలో మార్పు సాధ్యమని, పట్టుదల, జ్ఞానం, నిరంతర కృషితో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. వాల్మీకి బోధనలను ఆచరిస్తూ సమాజంలో సద్భావన, సమానత్వం, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, వివిధ శాఖల అధికారులు, వాల్మీకి జయంతి ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ బోయ వెంకటేశం, వాల్మీకి బోయ సంఘం ప్రతినిధులు వెంకట రామయ్య, బుచ్చయ్య, సంఘమేష్, ప్రభు, బక్కప్ప, శివరాజ్, శ్రీనివాస్, అనిల్, రాములు, ఆగమయ్య, రాజు, పండరి, జ్ఞానేశ్వర్, దినేష్, టీఎన్జీవో ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రోజూ వ్యాయామం.. ఆరోగ్యకరమైన జీవితానికి పునాది!

'కల్వర్' అభివృద్ధిపై కీలక సమీక్ష

సమావేశ నేపథ్యం ప్రజా సమస్యల ప్రస్తావన

పథకాలు, పనుల పరిశీలన.. అధికారులకు ఆదేశాలు

సమన్వయమే లక్ష్యం

నారాయణఖేడ్ నియోజకవర్గం, 26 అక్టోబర్, (విశ్వం న్యూస్):

నారాయణఖేడ్ నియోజకవర్గం, కల్వర్ మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించేందుకు మండల వీణూ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో సర్పంచులు, గ్రామ కార్యదర్శుల నుండి గ్రామాల్లోని సమస్యలు, మౌలిక సదుపాయాల అవసరాలు, అభివృద్ధి పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని వివిధ శాఖల అధికారులతో వారి పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, ప్రభుత్వ పథకాల అమలు, ముఖ్యంగా జీవీబీ రామ్ జీ పథకం, గ్రామీణ ఉపాధి అవకాశాలు, అభివృద్ధి పనులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు పథకాల ప్రయోజనాలు, అమలులో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చూడాలని, అభివృద్ధి పనులను నిర్దేశిత ప్రమాణాలతో చేపట్టాలని ఎంపీ, ఎమ్మెల్యేలు అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు, గ్రామాల వేగవంతమైన అభివృద్ధి లక్ష్యంగా మండల స్థాయిలో సమీక్షా సమావేశాల ఆవశ్యకతను నొక్కిచెప్పిన నాయకులు, సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.







సంగారెడ్డిలో ఆన్‌లైన్ ఓపెన్ హౌస్

పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలు.. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వివరణ

విద్యార్థులకు అవగాహన సదస్సు.. మహిళా, సైబర్ భద్రతపై సూచనలు

సంగారెడ్డి ప్రతినిధి, 26 అక్టోబర్, (విశ్వం న్యూస్):

పోలీస్ ఫ్లాగ్ డే, అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా, అక్టోబర్ 21 నుండి 31 వరకు చేపట్టిన కార్యక్రమాలలో భాగంగా, సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆన్‌లైన్ ఓపెన్ హౌస్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ (ఐపీఎస్) తెలిపిన వివరాల ప్రకారం, విధి నిర్వహణలో అమరులైన పోలీస్ త్యాగాలను స్మరిస్తూ, జిల్లావ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సంగారెడ్డిలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు మహిళల భద్రతలో షీ టీమ్స్ పాత్ర, షీ సేఫ్ అప్లికేషన్, డయల్ 112 వినియోగం, సైబర్ మోసాలు, 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ పనితీరు, ఫ్రెండ్లీ పోలీసింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం (ఫేస్ రికగ్నిషన్ సిస్టం, పాపిలాన్ డివైజ్), భరోసా కేంద్రం గురించి సమగ్ర అవగాహన కల్పించారు. స్థానిక న్యూస్ ఛానళ్ల ద్వారా ఆన్‌లైన్‌లో ప్రసారమైన ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శివకుమార్, సర్దార్, స్టేషన్ సిబ్బంది పాల్గొని విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

టీఎన్‌జీవోస్ నూతన సారథులకు అభినందనలు

మంత్రి, కలెక్టర్ హర్షం

సమర్థ పాలన, ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

నూతన కార్యవర్గ ప్రమాణం

ఐక్యత, అభివృద్ధికి ప్రాధాన్యం



సంగారెడ్డి ప్రతినిధి, 26 అక్టోబర్, (విశ్వం న్యూస్):

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్, సంగారెడ్డి జిల్లా టీఎన్‌జీవోస్ సంఘ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. మొహమ్మద్ జావిద్ అలీ అధ్యక్షుడిగా, వేల్పూరు రవి వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ కార్యదర్శులుగా ఎన్నిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు మరింత సమర్థవంతంగా పనిచేసేలా నూతన కార్యవర్గం కృషి చేయాలని, ఉద్యోగులకు ప్రభుత్వానికి మధ్య సమన్వయ వారధిగా నిలవాలని మంత్రి, కలెక్టర్ ఆకాంక్షించారు. దీనిపై స్పందించిన నూతన కార్యవర్గ సభ్యులు, తమపై నమ్మకం ఉంచిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా, వారి న్యాయమైన హక్కుల సాధనకు, పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల ఐక్యతను బలోపేతం చేయడం, సంఘటిత శక్తిని పెంపొందించడం, సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్య పద్ధతుల్లో ముందుకు సాగడం తమ ప్రాధాన్యాలని స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులందరినీ సమన్వయంతో ముందుకు నడిపిస్తామని పేర్కొన్నారు. మంత్రి, కలెక్టర్ అందించిన అభినందనలు తమకు మరింత ప్రోత్సాహాన్నిచ్చాయని, టీఎన్‌జీవోస్ సంఘ ప్రతిష్ఠను పెంపొందించడానికి అంకితభావంతో పనిచేస్తామని నూతన కార్యవర్గం ధీమా వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర అధ్యక్షులు బలరాం విజయలక్ష్మి, నాగమణి, ప్రమోద్ కుమార్, పట్టణ అధ్యక్షులు యాదవ రెడ్డి, కార్యదర్శి వెంకట్, వెంకటేశం, నాగేశ్వరరావు, రామప్ప, కిరణ్, గౌస్ హాస్మి, నవాజ్, నర్సింలు, దుర్గయ్య, ఇమ్రాన్ ఖాన్, నజీర్ హైమద్ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సామరస్యానికి నూతన కేంద్రాలు

నారాయణఖేడ్‌లో ఆవిష్కరణ

మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

నారాయణఖేడ్ నియోజకవర్గం, 26 అక్టోబర్, (విశ్వం న్యూస్):

నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో, కమ్యూనిటీ నిర్వహణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత కుటుంబ సలహా కేంద్రం, జెండర్ రిసోర్స్ సెంటర్లను డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రారంభించారు. మారుతున్న కాలంలో చిన్న మనస్పర్థలతో కుటుంబాలు విచ్ఛిన్నం కాకుండా నిపుణుల కౌన్సెలింగ్‌తో ఉచిత సలహాలు, సూచనలు అందించడం అభినందనీయమని సంజీవరెడ్డి పేర్కొన్నారు. మహిళల హక్కుల పరిరక్షణ, లింగ సమానత్వం, కుటుంబ సామరస్యం పెంపొందించడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాల వరకు వెళ్లకుండా గ్రామీణ మహిళలు, దంపతులు స్థానికంగానే సమస్యలు పరిష్కరించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. సమాజంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, పేదరిక నిర్మూలనతో పాటు సామాజిక భద్రతకు పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీఎం సాయిలు, నర్సింలు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, ఐకేపీ ఏరియా కోఆర్డినేటర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు, మహిళా



వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం: రామగుండం సీపీ

కమిషనరేట్‌లో వాల్మీకి జయంతి వేడుకలు

రామాయణం చిరస్థాయిగా నిలిచిపోతుంది

సత్యం, ధర్మం, నీతి బోధనలు.. మానవత్వానికి మార్గదర్శనం

మంచిర్యాల ప్రతినిధి, 26 అక్టోబర్, (విశ్వం న్యూస్):



రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఇతర అధికారులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచం ఉన్నంతకాలం మహర్షి వాల్మీకి చరిత్ర, ఆయన రచించిన రామాయణం చిరస్థాయిగా నిలిచిపోతాయని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామాయణం సత్యం, నీతి, ధర్మం, కర్తవ్యబోధ వంటి విలువలను మానవాళికి అందించిన అమూల్యమైన గ్రంథమని పేర్కొన్నారు. వాల్మీకి బోధనలు సమాజంలో సత్యం, న్యాయం, ధర్మం, సమానత్వం వంటి విలువలను పెంపొందించేందుకు నేటికీ ప్రేరణగా నిలుస్తున్నాయని తెలిపారు. మానవత్వం, సత్యం, ధర్మం వంటి ఉన్నత విలువలను ప్రపంచానికి పరిచయం చేసిన వాల్మీకి సమాజానికి ఆదర్శప్రాయులని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, రచనలు నైతిక విలువలు, కర్తవ్యనిష్ఠ, ధర్మబద్ధమైన జీవన విధానానికి మార్గదర్శకంగా నిలుస్తాయని కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు గోపి, రాజేంద్ర ప్రసాద్, చంద్రశేఖర్ గౌడ్, శ్రీనివాస్, ఆర్ఐలు దామోదర్, శేఖర్, రమేష్, సీసీ సందీప్, ఎస్సైలు ఉపేందర్, సంతోష్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

హైదరాబాద్, అక్టోబర్ 26 (విశ్వం న్యూస్) :

